క్లుప్తంగా

నేడు నూలు పూర్ణిమ గాయత్రీయజ్ఞం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణం శ్రీ భక్త మార్కండేయస్వామి దేవాలయంలో శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా 39వ నూలు పూర్ణిమ గాయత్రీయజ్ఞం, యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని, ఆపద కాలంలో సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. నియోజకవర్గ పరిధి పలువురికి సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద చెక్కులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు ఆయన శుక్రవారం నగరంలోని తన నివాసంలో బాధితులకు అందజేసి మాట్లాడారు. సీఎంఆర్‌ఎఫ్‌తో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి సురేందర్‌రెడ్డి, సూదిని శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్య, మట్ట పాండుగౌడ్, వెంకట్‌రెడ్డి, బిష్మాచారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న కమిషనర్ శంకర్

ఆమనగల్లు: హరిత ఆమనగల్లు లక్ష్యంగా ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేస్తున్నామని ఆమనగల్లు మున్సిపాలిటీ కమిషనర్ శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వన మహోత్సవంలో భాగంగా మున్సిపల్ పరిధి 7,9,11 వార్డుల్లో మొక్కలు అందజేశామని తెలిపారు. ప్రజలు వాటిని నాటి, సంరక్షించాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది సత్యనారాయణ, ఎల్లయ్య, సురేందర్, గౌతమి, రమేశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి

షాద్‌నగర్: బీఆర్‌ఎస్ హయాంలోనే షాద్‌నగర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, మాజీ కౌన్సిలర్లు ఈగ వెంకట్‌రాంరెడ్డి, బచ్చలి నర్సింహ, కానుగు అంతయ్య, ఎజాజ్‌లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నడూ లేని విధంగా బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ షాద్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. గడిచిన 20 నెలల కాంగ్రెస్ పాలనలో జరిగిన పురోగతిపై చర్చించేందుకు ఆ పార్టీ నాయకులు సిద్ధంగా ఉన్నారా అని సవాల్ విసిరారు. అద్దెలు చెల్లించలేక పేదలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రభుత్వం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శంకర్, రవియాదవ్, శేఖర్, కిషోర్, యాదగిరి, సలీం, రమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత.. రైతుల వెత



పీఏసీఎస్ గోదాం నుంచి యూరియా కొనుగోలు చేస్తున్న రైతులు

- ప్రాథమిక వ్యవసాయ కేంద్రం వద్ద కర్షకుల పడిగాపులు
- పీఏసీఎస్ గోదాం ఖాళీ..
- నిరాశగా వెనుదిరిగిన అన్నదాతలు

యాచారం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కర్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ యూరియా కోసం పాట్లు పడుతున్నారు. ఒకవైపు సాగు పనులు జోరుగా సాగుతుండగా.. యూరియా కొరత వారిని వేధిస్తోంది. యాచారం మండలం కొత్తపల్లి, నక్కర్తమేడిపల్లి, చౌదర్‌పల్లి, గునుగల్, యాచారం, నందివనపర్తి, తక్కళ్లపల్లి, మాల్, తమ్మలోనిగూడ, నల్లవెల్లి తదితర గ్రామాల్లోని రైతులు పత్తిపంటను అధికంగా సాగు చేశారు. వానలు పడుతున్న నేపథ్యంలో తెల్ల బంగారానికి యూరియాను వినియోగిస్తున్నారు. అవసరం మేరకు గడిచిన వారం రోజుల వ్యవధిలో స్థానిక పీఏసీఎస్ నుంచి 4,500 బస్తాల యూరియాను అన్నదాతలు కొనుగోలు చేశారు. అయితే శుక్రవారం ఒక్క రోజే 550 బస్తాలు అమ్ముడు పోయింది. సాయంత్రం వరకు పీఏసీఎస్ గోదాం ఖాళీ అయింది. గంటల కొద్దీ నిరీక్షించిన వారికి నిరాశే మిగిలింది. డిమాండ్‌కు సరిపడా లేకపోవడంతో రైతులందరికీ అందలేదు. దీంతో కర్షకుల అవసరం మేరకు మరోదఫా 1100 బస్తాల యూరియాను తెప్పించనున్నామని పీఏసీఎస్ సీఈఓ నాగరాజు తెలిపారు.

ఓటమి భయంతోనే ఓట్ల తొలగింపు



ఇబ్రహీంపట్నం: నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు



కడ్తాల్‌లో..

- బీజేపీకి ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న ఎన్నికల కమిషన్
- సీపీఎం నాయకుల ఆరోపణ

ఇబ్రహీంపట్నం: బీహార్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లిం, క్రిస్టియన్లను పాక్, బంగ్లాదేశీయులుగా చిత్రీకరిస్తూ ఓట్లను తొలగించిందని జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.సామెల్ ఆరోపించారు. ఓట్ల తొలగింపు, ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటర్ల ప్రక్షాళన పేరుతో ఒకేసారి 60 లక్షలకు పైగా ఓట్లను తొలగిస్తే ప్రజాస్వామ్యానికి విలువేముందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వ విధానాలు ఇప్పుడిప్పుడే ప్రజలకు అర్థం అవుతున్నాయని, తగిన రీతిలో రానున్న రోజుల్లో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎల్లేశ్, పురుషోత్తం, గణేశ్, సత్తన్న, జానీ, నర్సింహ్మ, దుర్గయ్య, రాములు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ పారదర్శకంగా పనిచేయాలి

కడ్తాల్: ఎన్నికల కమిషన్ బీహార్‌లో బీజేపీకి ఏజెంట్‌గా వ్యవహరిస్తోందని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఈసీకి వ్యతిరేకంగా శుక్రవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీహార్‌లో కమలం పార్టీకి వ్యతిరేకంగా ఉన్న లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ పారదర్శకంగా వ్యవహరించాలని, తొలగించిన ఓట్లను వెంటనే నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ జల్లెల పెంటయ్య, నాయకులు నర్సింహ, ఆశీర్వాదం ఉన్నారు.

మోతాదు మించితే ముప్పే

- చీడపీడలతో పంటకు నష్టం
- అవసరం మేరకు యూరియా వాడాలి
- వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి
- ఆమనగల్లు ఏడీఏ శోభారాణి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శోభారాణి

ఆమనగల్లు: పంటలకు తగిన మోతాదులో యూరియాను వేయాలని ఆమనగల్లు ఏడీఏ శోభారాణి అన్నారు. ఎక్కువగా వాడటం వలన చీడపీడల బెడద అధికమై.. పంట నష్టపోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఆమనగల్లు మండలంలో శుక్రవారం ఆమె రైతుల పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ డివిజన్ పరిధి ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో పత్తి, మొక్కజొన్న, వరి పంటలను సుమారు 1.15 లక్షల ఎకరాల్లో సాగుచేశారని తెలిపారు. వరికి ఎకరాకు ఒక బస్తా డీఏపీ, 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాషియం మొదటి దఫాగా దుక్కిలో వేయాలని రైతులకు సూచించారు. వరి పంట పిలకల దశలో 30 కిలోల యూరియా, పొట్టదశలో 30 కిలోల యూరియా, 15 కిలోల మ్యురెట్ పొటాషియం వినియోగించాలన్నారు. ఎక్కువగా వాడితే వృథా అవుతుందని పేర్కొన్నారు.

పత్రహరితం పెరిగి..

మొక్కజొన్న సాగు ఎకరాకు ఒక బస్తా డీఏపీ, 25 కిలోల మ్యురెట్ పొటాషియం దుక్కిలో వేయాలని, పంట మోకాలు ఎత్తు దశలో 45 కిలోల యూరియా, కంకి దశలో 45 కిలోల యూరియా వేయాలని ఏడీఏ చెప్పారు. అధిక మోతాదులో వేస్తే.. ఆకులలో పత్రహరితం పెరిగి, పురుగులను ఆకర్షిస్తుందని వివరించారు. దీనివలన పంటలో చీడపీడల సమస్య అధికమవుతుందన్నారు. పంట కాలం మొత్తానికి 2 బస్తాల యూరియా వేస్తే సరిపోతుందని స్పష్టం చేశారు. పత్తికి ఎకరాకు ఒక బస్తా డీఏపీ, 30 కిలోల యూరియా వేయాలన్నారు. పంట తొలపూత దశలో 30 కిలోల యూరియా, మొగ్గదశలో 30 కిలోల యూరియా వాడాలని తెలిపారు. పత్తి పంటలో కాంప్లెక్స్ ఎరువులతో యూరియాను కలిపి వేయడం వలన ఖర్చు భారం అవుతుందన్నారు. యూరియా మోతాదు మించితే చీడపీడల బెడద పెరుగుతుందని, భూమి లోపల ఉండే పోషకాలను మొక్కకు అందించే సూక్ష్మజీవులు చనిపోయి భూసారం తగ్గి, క్రమంగా భూమి నిస్సారమవుతుందని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి.. అధిక దిగుబడులు పొందాలని ఏడీఏ రైతులకు సూచించారు.

బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలి

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న అన్యాయాన్ని ప్రతిఒక్కరూ గుర్తిస్తున్నారని బీజేపీ ఓబీసీ చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ వెంకటేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 42 శాతం రిజర్వేషన్లు పూర్తిగా బీసీలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

మాజీ ప్రజాప్రతినిధులు



మొక్కలు నాటుతున్న బీఆర్‌ఎస్ నేతలు

ఆమనగల్లు: పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ కృషి చేయాలని మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, మర్రి జనార్దన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌లు అన్నారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు చోట్ల మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం పత్యానాయక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, కడ్తాల్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎల్.ఎన్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



విజేత జట్టుతో కమిషనర్ అమరేందర్ రెడ్డి

తుర్కయంజాల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి అన్నారు. తుర్కయంజాల్, ఆదిబట్ల పురపాలక సంఘాల ఉద్యోగుల మధ్య శుక్రవారం నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌ను కమిషనర్లు అమరేందర్ రెడ్డి, బాలకృష్ణలు ప్రారంభించారు. ఈ పోటీలో తుర్కయంజాల్ జట్టు విజయం సాధించింది. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

ఇంటింటి ప్రచారంలో కమలనాథులు



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న బీజేపీ శ్రేణులు

యాచారం: గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిధి చింతుల్ల, ధర్మన్నగూడెం గ్రామాల్లో శుక్రవారం మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ముద్రించిన కరపత్రాలతో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం నిధులతోనే పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మడం లేదని, ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపే చూస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. కమలానికి బ్రహ్మరథం పట్టనున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌నాయక్, నాయకులు యాదయ్య, జగదీష్ యాదవ్, రమేష్, రవీందర్, రాజు, శాంతికుమార్, ఈశ్వర్, నరేష్, సందీప్‌రెడ్డి, నాగరాజు, నర్సింహ, కుమార్, పాండు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అనురాగ బంధం.. రక్షాబంధన్



ఇబ్రహీంపట్నం: రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

- నేడు రాఖీ పౌర్ణమి
- రద్దీగా రాఖీ, మిఠాయి దుకాణాలు
- ధరలు పెరిగినా.. నచ్చినవి కొనుగోలు చేసిన ఆడపడుచులు

ఇబ్రహీంపట్నం: సోదరీ సోదరిమణుల అనుబంధానికి, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచిన రాఖీ పౌర్ణమి వేడుకలు నేడు జరుపుకోనున్నారు. ఏటా శ్రావణ పౌర్ణమిన ఈ పండుగను జరుపుకొంటారు. ఈ రోజున అక్కాచెల్లెళ్లు తమ అనుబంధానికి గుర్తుగా.. అన్నాదమ్ములు ఆయురారోగ్యాలతో చల్లంగా ఉండి, తమకు రక్షగా ఉండాలని రాఖీ కట్టి, నోరు తీపి చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆప్యాయంగా రక్ష కట్టిన సోదరికి తోచిన కానుకలు అందజేసి, అండగా ఉంటానని సోదరులు భరోసా ఇస్తూ.. దీవెనలు పొందుతారు.

ఆకర్షణీయమైన ఆకృతులు

రక్షాబంధన్‌ను పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం కొత్త బస్టాండ్, సంతోష్ థియేటర్, పాత బస్టాండ్, మంచాల రోడ్డు ప్రధాన రహదారులకు ఇరువైపులా రాఖీ విక్రయాల దుకాణాలు వెలిశాయి. దీంతో ఆయా షాపులు.. శుక్రవారం ఆడపడుచులతో కళకళలాడుతున్నాయి. ఆకర్షణీయమైన ఆకృతుల్లో ఉన్న రాఖీలను కొనుగోలు చేసేందుకు మక్కువ చూపారు. ధరలు పెరిగినప్పటికీ.. ఆప్యాయత అనురాగం ముందు అది ఏమంత పెద్దది కాదని నచ్చినవి కొనుగోలు చేశారు. మిఠాయిల దుకాణాలు సందడిగా ఉన్నాయి. నిర్వాహకులు స్వీట్లను ప్రత్యేకంగా తయారు చేసి సిద్ధంగా ఉంచారు.



యాచారంలో.. రాఖీ దుకాణాలు

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

పరిసరాల పరిశుభ్రత పాటించాలి: వైద్య సిబ్బంది

మీర్‌పేట: వానాకాలం. ఆపై సీజనల్ వ్యాధుల కాలం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా.బాలమణి సూచించారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలని చెప్పారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో యూపీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెబుతున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు చుట్టుముట్టే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. సర్వేలో భాగంగా రెండు రోజులకు పైగా ఎవరికైనా జ్వరం లక్షణాలు ఉంటే.. అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.



ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

పండుగ సాయన్న పోరు మరువలేనిది

షాద్‌నగర్: ప్రజావీరుడు పండుగ సాయన్న అని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య అన్నారు. శుక్రవారం పండుగ సాయన్న జయంతిని షాద్‌నగర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెన్నయ్య మాట్లాడుతూ.. నిరుపేదలకు సహాయం చేసే వ్యక్తిగా సాయన్న పేరు సంపాదించారన్నారు. పెత్తందారుల అన్యాయాలను, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పేదల పక్షాన నిలబడి పోరాటం చేశారన్నారు.



సాయన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రచారంలోనే 'అభివృద్ధి'!

- కాలనీల్లో కనిపించని కనీస వసతులు
- సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలు
- కార్పొరేషన్‌కు సొంత యంత్రాలు సమకూర్చుకోలేని అసమర్థత
- చెత్త సేకరణకు సైతం సరైన వాహనాలు లేని వైనం
- పాలకులు, అధికారులతీరుపై ప్రజల మండిపాటు



చెత్త సేకరించే ట్రాక్టర్‌ను స్టార్ట్ చేసేందుకు నెడుతున్న సిబ్బంది

బడంగ్‌పేట్: సుమారు రూ.400 వందల కోట్లతో మున్సిపల్ కార్పొరేషన్‌ను అభివృద్ధి చేశామని చెబుతున్న గత పాలకులు, వీరికి వత్తాసు పలుకుతూ అధికారులు ఒకరుకు మించి మరొకరు ప్రచారం చేసుకుంటున్నారు. కానీ కాలనీల్లో సమస్యలు తిష్ట వేశాయని ప్రజలు మండిపడుతున్నారు. ఆరు నెలల క్రితం పదవీ కాలం పూర్తయిన గత పాలకులు, అధికారులు కుమ్మక్కై కార్పొరేషన్‌ను అవినీతిమయంగా మార్చేశారనే ఆరోపణలున్నాయి. కనీసం రోజూవారీ పనుల నిర్వహణ కోసం అవసరమై యంత్రాలు సమకూర్చుకోవడంలోనూ విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఒకే గల్పర్ మిషన్‌తో పనులు

2013లో నగర పంచాయతీగా ఏర్పడినప్పుడు చెత్త సేకరణ, ఇతర అవసరాలకు నాలుగు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. అందులో ఒక ట్రాక్టర్‌కు నంబర్ ప్లేట్ రాకముందే దొంగలు ఎత్తుకెళ్లారు. ఇక మిగిలిన ట్రాక్టర్లతో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. నాడే ఒక చిన్న గల్పర్ మిషన్‌ను తీసుకొచ్చారు. వాటితోనే పనులు కొనసాగిస్తున్నారు. అయితే నగర పంచాయతీ నుంచి మున్సిపాలిటీకి, మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా బడంగ్‌పేట అవతరించింది. కార్పొరేషన్ అభివృద్ధికి రూ.400 కోట్లు ఖర్చు చేశామని అధికారులు చెబుతున్నారు. కానీ కావాల్సిన పర్మినెంట్ పరికరాలు(ట్రాక్టర్లు, జేసీబీలు, గల్పర్‌లు వగైరా) ఒక్కటి కూడా కొనుగోలు చేయడంలో విఫలమయ్యారు.

ఎందుకు కొనుగోలు చేయలేదో?

కార్పొరేషన్‌లో సుమారు మూడు లక్షల జనాభా ఉంది. నిత్యం 8 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. 4 వందలకుపైగా కాలనీలు ఉండగా.. నిత్యం పది కాలనీలకుపైగా డ్రైనేజీ పొంగుతోందని ఫిర్యాదులు. సిబ్బంది ఉన్నా వారికి సరిపడా పరికరాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా కార్పొరేషన్‌లో వెనకటి కాలంలో మోరీలకు దిగి మురుగు శుద్ధి తొటగించినట్టే.. ప్రస్తుతం సిబ్బంది చేత కొన్ని చోట్ల పనులు చేయిస్తున్నారు. చిన్న గల్పర్ మిషన్‌తో రెండు డ్రైనేజీలు శుభ్రం చేసే స్థాయి మాత్రమే ఉంది. ఇంత పెద్ద కార్పొరేషన్‌లో ఎందుకు పెద్ద గల్పర్ మిషన్‌ను కొనుగోలు చేయడంలేదో అధికారులకే తెలియాలి. సెల్ఫ్ లేని ట్రాక్టర్లతో గల్లీలకు వచ్చి బండి ఆగిపోతే తోయడానికి కాలనీవాసులకు సిగ్గు అనిపించి ముందుకు రాకపోవడంతో నిత్యం చెత్తను సేకరించి ఆగిన బండ్లను పారిశుద్ధ్య సిబ్బందే తోసుకొని వెళ్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది పడుతున్న కష్టాలు అధికారులు ఎందుకు గుర్తించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ప్రచార ఆర్భాటమే..

పాలకులు పలు పార్టీల నుంచి వచ్చినవారు కావడంతో తమకు, తమ పార్టీలకు మెప్పు వస్తుందని ప్రచారం చేసుకోవడంలో అర్థం ఉంది. కానీ అధికారులు సైతం అదే ప్రచార ఆర్భాటంలో మునిగిపోతున్నారు. నిజమేనని పబ్లిక్ నమ్ముతోంది. అంతా విప్పి చూస్తే డొల్లతనం కనిపిస్తోంది. సొంత కార్పొరేషన్‌లో పర్మినెంట్ పరికరాలు, వస్తువులు కొనుగోలు చేయకుండా సిబ్బంది చేత వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ప్రజా సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకొని కార్పొరేషన్‌కు కావాల్సిన ట్రాక్టర్లు, లారీలు, బుల్డోజర్లు, జేసీబీలు, గల్పర్ మిషన్‌లు కొనుగోలు చేసి, సిబ్బంది శ్రమను తగ్గించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

శ్రావణ శుక్రవారంను పురస్కరించుకొని భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచే భక్తజనం దేవాలయాలకు చేరుకొని అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయాల్లో సామూహిక వ్రతాలు, తమ ఇళ్లల్లోనూ చేశారు. అనంతరం వాయినాలు అందజేశారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయం, సత్యసాయి మందిరం, యాచారం మండల కేంద్రం ముత్యాలమ్మ దేవాలయంలో వ్రతాలు జరిపారు. ఇబ్రహీంపట్నం త్రిశక్తి ఆలయంలో మహాలక్ష్మీ, మహాసరస్వతి, మహంకాళి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. పలుచోట్ల అన్నదానం చేశారు.

–సాక్షి, నెట్‌వర్క్



యాచారం: ముత్యాలమ్మ దేవాలయంలో..



ఆమనగల్లు: వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో సామూహిక వ్రతాలు



ఆమనగల్లు: వరలక్ష్మీవ్రతం చేస్తున్న దంపతులు



ఇబ్రహీంపట్నంలో..



ఇబ్రహీంపట్నంలో..



కడ్తాల్‌లో..